# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 24-09-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- వరద ప్రభావిత జిల్లాల్లో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

- స్థిరమైన ప్రభుత్వంతోనే పేదరిక నిర్మూలన జరుగుతుందని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

- ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రాష్ట్ర వ్యాప్తంగా 613 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయని మంత్రి బీ.సీ. జనార్ధన్ రెడ్డి తెలిపారు.

- వాయువ్య బంగాళాఖాతం, పశ్చిమ-మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం ఈరోజు సాయంత్రానికి క్రమంగా బలహీనపడే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

==========================

వర్ష ప్రభావిత జిల్లాలలో యంత్రాంగం మొత్తం అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. వివిధ జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి ఈరోజు శ్రవణ మాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వరదలను ఎప్పటికప్పుడు అంచనా వేసుకుంటూ దానికి అనుగుణంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాలతో ఎక్కడైనా ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడితే క్షేత్రస్థాయికి వెళ్లి చక్కదిద్దాలని కోరారు. రహదారులు దెబ్బతిన్న చోట రవాణా సదుపాయాన్ని వెంటనే పునరుద్ధరించాలని సూచించారు. వర్షానికి కొండ చరియలు విరిగిపడే చోట నివాసితులను అప్రమత్తం చేయాలని, విద్యుత్ సరఫరాలో ఎక్కడా అంతరాయం ఉండకూడదని స్పష్టం చేశారు. చెరువులు నింపడంపైన దృష్టి పెట్టడంతో పాటు విరిగిపడ్డ చెట్లను వెంటనే తొలగించాలన్నారు. కంట్రోల్ రూములు ఏర్పాటు చేసుకుని క్షేత్రస్థాయి నుంచి సమాచారం తీసుకోవాలని చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు.

========================

స్థిరమైన ప్రభుత్వంతోనే పేదరిక నిర్మూలన జరుగుతుందని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. వ్యవసాయం నుంచి ఉత్పత్తి రంగం వరకూ రాష్ట్రం వేగవంతమైన ప్రగతిని సాధిస్తోందని తెలిపారు. పబ్లిక్ అఫైర్స్ ఫోరం ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 'స్వర్ణాంధ్ర@2047' (Andhra Pradesh-Swarna Andhra@ 2047 : The New Growth Laboratory) అంశంపై ఢిల్లీలో ఈరోజు నిర్వహించిన ఒక కార్యక్రమంలో మంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...

(వాయిస్ 26 సెకన్లు)

========================

తిరుపతి జిల్లా గ్రామీణ విలేఖరులకు అక్టోబర్ 3, 4వ తేదీల్లో పునశ్చరణ తరగతులని నిర్వహిస్తున్నామని సి.ఆర్.మీడియా అకాడమీ ఛైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం "సెనేట్ హాల్"లో ఈ పునశ్చరణ తరగతులను అనుభవజ్ఞులైన పాత్రికేయ ప్రముఖుల ద్వారా నిర్వహిస్తామని వెల్లడించారు.

========================

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో రాష్ట్ర వ్యాప్తంగా 613 కిలోమీటర్ల ఆర్ & బి రహదారులు దెబ్బతిన్నాయని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. అత్యధికంగా శ్రీకాకుళంలో జిల్లాలో 356 కిలో మీటర్ల మేర రహదారులు పాడయ్యాయని చెప్పారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాలో రహదారులకు ఎక్కువ నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. వర్షం కారణంగా దెబ్బతిన్న రహదారులు తాత్కాలిక పునరుద్ధరణకు దాదాపు 26 కోట్ల 95 లక్షల రూపాయలు, శాశ్వత ప్రాతిపదికన పునరుద్ధరణకు 224.73 కోట్ల రూపాయలు అవసరమవుతుందని అంచనా వేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇరవై అయిదేళ్ల ప్రజా సేవ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రాంతీయ వార్తా విభాగం `సేవా సంకల్ప్ అభియాన్` పేరిట ప్రత్యేక కథనాలను అందిస్తోంది. అందులో భాగంగా `పీఎం స్వనిధి` పథకం గురించి ఇప్పుడు తెలుసుకుందాం!.
దేశంలో గడచిన పన్నెండేళ్ళుగా ప్రధానమంత్రి స్వనిధి పథకం ద్వారా ఎంతో మంది లబ్ది పొందారు - ప్రధాన్ మంత్రి స్ట్రీట్ వెండర్స్ ఆత్మనిర్భర్ నిధిగా పేర్కొనే ఈ పథకం వల్ల పట్టణ ప్రాంతాల్లో వీధి వ్యాపారుల జీవనోపాధిని పునరుద్ధరించడానికి కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలను చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం 2020 జూన్ 1న కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన చిన్న రుణాల పథకంగా ఇది గుర్తింపు పొందింది. ఈ పథకం కింద ఎలాంటి పూచీకత్తు లేకుండా విడతలవారీగా రుణాలు అందిస్తారు. అదే విధంగా వడ్డీ రాయితీ కూడా ఉంటుంది. రుణాలు సక్రమంగా, ఎప్పటికప్పుడు చెల్లించే వారికి సంవత్సరానికి ఏడుశాతం చొప్పున వడ్డీ రాయితీ నేరుగా ఖాతాలో జమ అవుతుంది. పట్టణ ప్రాంతాల్లో లేదా పరిసర ప్రాంతాలలో వీధి వ్యాపారం చేసుకునేవారందరూ ఈ పథకానికి అర్హులు. ఇప్పటికీ ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా ఎంతో మంది లబ్ధి పొందారని కేంద్ర ప్రభుత్వ అధికార గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

విరామం

========================

వాయువ్య బంగాళాఖాతం పశ్చిమ-మధ్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం ప్రస్తుతం గంటకు 7 కిలోమీటర్ల వేగంతో వాయువ్య దిశగా కదులుతూ.. తూర్పు-ఆగ్నేయంగా 170 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి కరుణ కుమార్ తెలిపారు. తదుపరి ఇది ఉత్తర-వాయువ్య దిశగా పయనించి.. ఈ సాయంత్రానికి క్రమంగా బలహీనపడే అవకాశం ఉందని చెప్పారు. దీని ప్రభావంతో ఈరోజు, రేపు ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు రాష్ట్రంలో పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని ఆయన తెలియచేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========================

రాష్ట్రంలో ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితులను తగ్గించేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరారు. అమరావతిలో రియల్‌టైమ్ గవర్నెన్స్ కేంద్రంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... భూసారాన్ని పెంచడం, సాయిల్ టెస్టింగ్ ఆధారంగా ప్రత్యామ్నాయ పంటలను సూచించడం, ప్రకృతి వ్యవసాయం వంటి విధానాల ద్వారా ఎల్‌నినో ప్రభావాన్ని కొంతమేర తగ్గించవచ్చని తెలిపారు. ఈ విధానాన్ని రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి వ్యవసాయ రంగానికి అవసరమైన సూచనలు అందించేలా సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా కృష్ణా, గోదావరి డెల్టాలోని రిజర్వాయర్లతో పాటు రాష్ట్రంలోని అన్ని నీటి వనరుల్ని వరద నీటితో నింపాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

==========================

వర్ష ప్రభావిత జిల్లాల్లోని మున్సిపల్ కమిషనర్లతో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ అమరావతి నుంచి ఈరోజు శ్రవణ మాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలువకుండా చూడాలని, ఇంజనీరింగ్, పారిశుధ్య సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండేలా కమిషనర్లు చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్ కార్యాలయాల్లో ప్రత్యేక కాల్ సెంటర్లు ఏర్పాటు చేయాలని మంత్రి నారాయణ సూచించారు.

==========================

రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో జల వనరుల శాఖ ఉన్నతాధికారులతో ఆ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఈరోజు అమరావతి నుంచి శ్రవణ మాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు. వాతావరణ శాఖ నుంచి ముందస్తు సమాచారం తీసుకుంటూ.. వరద నియంత్రణ చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. రిజర్వాయర్లు, నదులు, వాగుల్లోకి వచ్చే నీటిపై ఎప్పటికప్పుడు అంచనా వేయాలన్నారు. మున్నేరుకు వచ్చే ఇన్ ఫ్లోను, బుడమేరు వరదను బట్టి పట్టిసీమ పంపులను పని చేయించాలని సూచించారు. ఏలేరు రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ వర్షానికి అనుగుణంగా పురుషోత్తమపట్నం పంపులను ఆపరేట్ చేసుకోవాలని చెప్పారు. అలాగే వంశధార, నాగావళి, బహుదా, మహేంద్రతనయ నదులు ప్రవాహాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ... ప్రజలను అప్రమత్తం చేయాలని నిమ్మల రామానాయుడు కోరారు.

==========================

ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలతో బీసీ హాస్టళ్లు, గురుకులాల్లో చదువుకునే విద్యార్థులు ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత అధికారులను ఆదేశించారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి ఈరోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యాధులు ప్రబలకుండా హాస్టళ్లు, గురుకులాల పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, విద్యార్థులు అస్వస్థతకు గురైతే తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని స్పష్టం చేశారు.

==========================

శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈరోజు విస్తృతంగా పర్యటించారు. టెక్కలి మండలం పరిధిలోని మెలియాపుట్టి రహదారిని.. తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాలను పరిశీలించారు. రహదారుల పునరుద్ధరణకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాలతో వ్యవసాయ పొలాల్లో చేరిన నీటిని కూడా మంత్రి పరిశీలించారు. రైతులకు నష్టం కలగకుండా క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.

==========================

రాష్ట్రంలో డేటా సెంటర్ ఎకోసిస్టమ్ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. సిస్కో సిస్టమ్స్ (యుఎస్ఏ) మేనేజింగ్ డైరెక్టర్ హరీష్ కృష్ణన్ తో న్యూఢిల్లీలో మంత్రి ఈరోజు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... డేటా సెంటర్ల డిమాండ్ కు అనుగుణంగా రాష్ట్రంలో యూనిఫైడ్ కంప్యూటింగ్ సిస్టమ్ (UCS) సర్వర్లు, స్విచ్‌లు, రౌటర్ల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

==========================

==========================